అభివృద్ధి మెరిసె... కాలనీలు మురిసె!

- 21వ వార్డులో అభివృద్ధి పరుగులు
- సందుల్లోనూ వెలసిన సీసీ రోడ్లు
- కళకళలాడుతున్న కాలనీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది. దీంతో పట్టణాలే కాదు పల్లెలు అభివృద్ధి బాట పట్టాయి. ఏళ్లతరబడి కనీస మౌలిక వసతులకు నోచుకోని పట్టణ పరిధిలోని కాలనీలు నేడు కళకళలాడుతున్నాయి. ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆదోని పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఈ మేరకు 21 వార్డు కాలనీలు సుందరంగా మారాయి. ఈ వార్డు పరిధిలో సాయిబాబా నగర్, ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డు, 1, 2, 3 రోడ్లు, ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్ ఏరియాలు ఉన్నాయి. 5,100 మంది జనాభా ఉన్నారు. గతంలో ఇబ్బంది పడిన రహదారుల సమస్య తీరడంతో వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సందుసందున, వీధివీధినా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, కాలువలు, పైపులైన్లు, కల్వర్టులు ఏర్పాటు చేశారు.



గర్ల్స్ హైస్కూల్ వైపు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు, డివైడర్



నిర్మల్ టాకీస్ వైపు వెళ్లే దారిలో తీర్చిదిద్దిన బీటీ రోడ్డు



వార్డులో జరిగిన కొన్ని అభివృద్ధి పనుల వివరాలు

- సాయిబాబానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ కాలువలను ఏర్పాటు
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.10 లక్షలతో ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం
- రూ.40 లక్షలతో డీఎస్పీ బంగ్లా రోడ్డులో ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్ నుంచి బీటీ రోడ్డు
- రూ.3 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులో సాయి డిగ్రీ కళాశాల వద్ద మినీ వాటర్ స్కీం, మండిగిరి రోడ్డు వద్ద విస్తరణ ఏరియాలో మరో మినీ వాటర్ స్కీం ఏర్పాటు
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.10 లక్షలతో మండిగిరిలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.6 లక్షలతో మహబూబియా టాకీస్ ఏరియాలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు.



సాయిబాబానగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేసిన దృశ్యాలు →

ప్రజల కష్టాలు తీర్చాం



ఎస్కేడీ కాలనీ, సాయిబాబానగర్, జీరో రోడ్డు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు లేక చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రజలు ముందుగా తమకు రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయాలని కోరేవారు. అయితే తాము ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశాం. ప్రజల కష్టాలు తీరిపోయాయి. 21వ వార్డులో దాదాపు 5 వేల మంది జనాభా ఉంది. అందరికీ అనుకూలంగా, వారి అవసరం మేరకు రోడ్లు, తాగునీటి పైపులైన్లు, వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తున్నాం.

– పేరం రాజేశ్వరరెడ్డి, కౌన్సిలర్

రోడ్లు బాగా వేశారు



ఎస్కేడీ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు బాగా వేశారు. గతంలో రోడ్లు లేక, కాలువలు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. మురుగునీరు ఇళ్ల ముందే నిలిచేవి. గుంతలు పడ్డ రోడ్లతో నడవలేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రభుత్వం వాడవాడలా సీసీ రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయడంతో కష్టాలన్నీ తొలగిపోయాయి. చాలా సంతోషంగా ఉంది.

– తాయమ్మ, ఎస్కేడీ కాలనీ

చిన్నచిన్న సందుల్లోనూ రోడ్లు



చిన్నచిన్న సందుల్లోనూ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేశారు. రోడ్లు వేయడంతో ఇళ్ల ముందు పరిశుభ్రంగా ఉంటున్నాయి. రాత్రిపూట ఇళ్ల ముందు చాలా ప్రశాంతంగా ఉంది. ఇళ్లల్లో వేడిమికి ఉండలేక ఇంటి ఆరుబయటనే ఉంటున్నాం. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ప్రస్తుతం రోడ్లు ఏర్పాటుతో చాలా బాగుంది.

– పద్మ, ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డు

ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూ.11,43,39,686

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం,రూ.
జగనన్న అమ్మఒడి	409	1,90,03,832
జగనన్న విద్యాదీవెన	214	58,94,078
జగనన్న వసతిదీవెన	164	25,18,167
వైఎస్సార్‌రైతుభరోసా	223	98,99,150
డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా	136	44,51,384
సున్నావడ్డీ పంట రుణాల రైతులు	44	1,43,674
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	23	3,28,350
వైఎస్సార్ పెన్షన్ కానుక	395	3,86,14,750
వైఎస్సార్ చేయూత	199	86,25,000
వైఎస్సార్ ఆసరా	330	60,81,351
వైఎస్సార్ సున్నావడ్డీ	553	14,92,721
వైఎస్సార్ కాపునేస్తం	13	5,85,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	20	5,40,000
వైఎస్సార్ కళ్యాణమస్తు	1	75,000
డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	99	51,68,874
డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	63	3,69,400
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	104	72,08,923
వైఎస్సార్ బీమా	06	7,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	30	8,60,000
వైఎస్సార్ నేతన్ననేస్తం	01	96,000
జగనన్న చేదోడు	35	7,90,000
వైట్ కార్డు హోల్డర్‌లకు ప్రత్యేక కోవిడ్ సహాయం	807	8,07,000
జగనన్న తోడు (వడ్డీ)	81	27,032
పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) మొత్తం : రూ.6,17,93,858		
ఇంటి స్థలాలు	127	3,12,42,000
జగనన్న విద్యాకానుక	172	12,21,544
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	32	4,23,104
జగనన్న తోడు	156	29,4,564
జగనన్న గోరుముద్ద	190	18,82,330
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	216	40,45,680
ఇంటింటికి రేషన్	919	2,00,74,636
డీబీటీ, నాన్ డీబీటీతో చేకూరిన లబ్ధి		మొత్తం : 17,61,33,544

క్లుప్తంగా

పట్టణంలో పోలీసుల కవాతు



ఆదోని పట్టణంలో కవాత్ నిర్వహిస్తున్న బలగాలు

ఆదోనిఅర్బన్: జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆదివారం ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న జనరల్ ఎలక్షన్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆదోని పట్టణంలోని చిన్నమార్కెట్, షరాఫ్‌బజార్ హవనన్పేట, కార్వన్‌పేట మీదుగా తిక్కస్వామిదర్గా వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు తేజమూర్తి, గోపీచంద్, త్రీటౌన్ ఎస్ఐ నాగేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలు చేతబూని పురవీధిలో తిరుగుతున్న క్రైస్తవులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని విక్టోరియా పేటలో ఉన్న సీఎస్ఐ చర్చి, ఎస్‌కెడీ కాలనీలో ఉన్న హోలీ ట్రినిటీ చర్చి, ఆర్‌సీఎం చర్చిలలో మట్టల ఆదివారం పండుగ ఘనంగా జరిగింది. సీఎస్ఐ చర్చి పాస్టర్ విలియం సుజిత్, హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ భాస్కర్ బాబు మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. అనంతరం ఆయా సంఘాల సభ్యులు, క్రైస్తవులు మట్టల చేతబూని పాటలు పాడుతూ చర్చి చుట్టూ పురవీధుల గుండా కలియతిరిగారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం



నాటుసారా సామగ్రిని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఆదోనిరూరల్: ఆదోని సెబ్ అధికారుల ఆధ్వర్యంలో ఆదోని పట్టణ శివారులో నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించారు. 1,000 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల నాటుసారాయిని ధ్వంసం చేసి ఒక వ్యక్తినిఅదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ వినీలత తెలిపారు. అలాగే పెద్దహరివాణం చెక్ పోస్టు వద్ద ముళ్లపొదల్లో వదిలివెళ్లిన 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ఆదోనిరూరల్: ఆదోని రూరల్ సీఐ నిరంజన్ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎలక్షన్ల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్ గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పెద్దతుంబళం, ఇస్వీ, రూరల్ ఎస్ఐలు చిన్నపీరయ్య, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆలూరు

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామంలో నిర్వహించిన మండలస్థాయి సమ్మర్ క్రికెట్ పోటీలలో ఆలూరు ఎస్పీ లెవెన్ జట్టు విజయం సాధించగా చిప్పగిరి నాకౌట్ లెవెన్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.20 వేలు ప్రైజ్ మనీ కేధార్నాత్ రెడ్డి, దివాకర్ రెడ్డి అందించగా రన్నర్ జట్టుకు మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి రూ.10 వేలు ప్రైజ్ మనీ అందించారు.

27న ఓటు హక్కుపై అవగాహన సదస్సు

ఆలూరు: ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై ఈనెల 27న స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాము నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల మెజిస్ట్రేట్, కలెక్టర్ డాక్టర్ సృజన ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

టీబీ డ్యాంలో 5.402 టీఎంసీల నీరు

హొళగుంద: ఉమ్మడి రిజర్వాయర్ కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో ఆదివారం ఉదయం 5.402 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగు, తాగు నీరును అందిస్తున్న టీబీ డ్యాంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి నిల్వ వేగంగా పడిపోయింది. దీంతో ఎల్లెల్సీ కింద ఒక కారు (ఖరీఫ్) పంటకు మాత్రమే సాగు నీరు అందించిన టీబీ బోర్డు అధికారులు రబీకి సాగు నీరివ్వకుండా కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం గత నెల 19వ తేదీ నుంచి ఎల్లెల్సీకి 480 క్యూసెక్కుల ప్రకారంగా నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో ఆదివారం ఉదయం నాటికి 1633 అడుగులకు గాను 1581.79 అడుగుల వద్ద నీరు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో రూపంలో ఎల్లెల్సీకి 844 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ఆత్మశుద్ధికి అవకాశం

- సన్మార్గంలో నడవాలంటున్న ఖురాన్
- రంజాన్ మాసంలో సత్కార్యానికి పదింతల పుణ్యఫలం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

కౌతాళం: పవిత్ర రంజాన్ మాసం సత్కార్యాల సమాహారం. ఈ మాసంలో దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తుంటుంది. ఆచరించే ప్రతి మంచి పనికి 70 రెట్ల పుణ్యఫలం లభిస్తుంది. ఈ పుణ్య మాసంలో చిత్తశుద్ధితో ఆరాధనలు చేసిన వారికి సర్వ శుభాలు కలుగుతాయని ఖురాన్ ఉపదేశిస్తుంది. అయితే ఉపవాస దీక్ష పాటించని వారితో పాటు బంధుత్వ సంబంధాలను తెంచేవారిని, మనస్సులో పగ, ప్రతీకారేచ్ఛ కలిగినవారు, తల్లిదండ్రుల పట్ల అవిధేయతగా మెలిగేవారు, తాగుబోతులకు క్షమాపణ లభించదని పేర్కొంటోంది.

బంధాలకు విలువనివ్వాలి..

అనంతమైన దైవకారుణ్యం ఉన్నప్పటికీ పాప ప్రక్షాళన జరగడం లేదంటే, ఈ అవలక్షణాలు ఎంత ఘోరమైనవో గ్రహించాలి. బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏ కారణం వల్ల నైనా పొరపొచ్చాలు ఏర్పడితే సాధ్యమైనంత త్వరగా వాటిని దూరం చేసుకునే ప్రయత్నం చేయాలి. పంతాలు, పట్టింపులకు పోయి మనస్పర్ధలు పెంచుకోకూడదు. క్షమాగుణం అలవర్చుకోవాలని, ప్రేమ పూర్వక సంబంధాలను నెలకొల్పుకోవాలని ఖురాన్ సూచిస్తుంది. పగ, ప్రతీకారాలకు పోకుండా సమాజం పట్ల బాధ్యతగా మలుచుకోవాలని గుర్తు చేస్తుంది.

తల్లిదండ్రులను గౌరవించాలి..

తల్లిదండ్రుల్ని గౌరవించాలి, వారికి సేవలు చేయాలి, వారి మనస్సుకు కష్టం కలిగించరాదు. తల్లి పాదాల కింద స్వర్గం ఉంది. తండ్రి స్వర్గానికి సింహద్వారం, తండ్రి సంతోషంలోనే దైవ సంతోషం ఉంది. తండ్రి సంతోషంగా లేకపోతే స్వర్గద్వారం తెరుచుకోదు. ప్రసన్న వదనంతో తల్లిదండ్రుల వైపు ప్రేమతో చూస్తే స్వీకార యోగ్యమైన ఒక హజ్ చేసినంత పుణ్యం లభిస్తుందని ప్రవక్త చెప్పారంటే తల్లిదండ్రుల స్థానం ఏమిటో అర్థం చేసుకోవాలి.

మద్యం జోలికొద్దు..

తాగుడు అలవాటు ఉన్నవారికి దైవక్షమాపణ లేదని ఖురాన్ పేర్కొంటుంది. రమజాన్ లాంటి పవిత్ర మాసంలో కూడా మన్నింపు లేదంటే తాగుడు ఎంతటి నీచమైన అలవాటని అల్లా పేర్కొన్నారో అర్థం చేసుకోవాలి. ఇలాంటి అవలక్షణాలు ఉన్నావారు ఆత్మపరిశీలన చేసుకునేందుకు ఈ మాసం మంచి అవకాశం.

కుల,మతాలను రెచ్చగొడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య

ఆదోని రూరల్: ప్రజలను కులాలు, మతాలుగా విభజిస్తూ బీజేపీ రెచ్చగొడుతోందని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి సుదర్శన అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పౌరుల హక్కులు హరించే పద్ధతుల్లో పరిపాలన కొనసాగిస్తుందన్నారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలు చాలా భిన్నమైనవని ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని ఓడించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన టెలికాం, ఎల్ఐసీ, రైల్వే చివరికి అంతరిక్ష పరిశోధన కేంద్రాలను కూడా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని మోదీ నెరవేర్చలేదన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని రప్పించి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రధానిని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీరేష్, సీపీఐ సీనియర్ నాయకులు బసాపురం గోపాల్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు షేక్షావలి, ఏపీ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసప్ప, యల్లప్ప, వీరేష్, కులవృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, దళిత సంఘం నాయకులు గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింటా ప్రచారం

కోసిగి: మండలంలో ఈనెల 26వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటా ప్రచారం చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 7గంటలకు జుమ్మాలదిన్నె, గొడుగల్లు, సాయంత్రం వందగల్లు, నేలకోసిగి గ్రామాలు, ఈనెల 27న ఉదయం దుద్ధి, కొల్మాన్‌పేట, సాయంత్రం ఆర్లబండ గ్రామాల్లో పర్యటన ఉంటుందని చెప్పారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలో సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తామన్నారు.

ఘనంగా మన్మథస్వామి రథోత్సవం



రథంలో ఊరేగిస్తున్న రతీమన్మథుడు, పరమేశ్వరుడు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కిలిచినపేటలోని శ్రీ అంబాభవానీ దేవాలయం వద్ద శ్రీ మన్మథస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంబాభవానీ భక్త బృందం నేతృత్వంలో స్వకులసాలే కులస్తులు రతీమన్మథులు, పరమేశ్వరుని విగ్రహాలను రథంలో ఆశీనులుగావించి డోలు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా పురవీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా ఇద్దరు చిన్నారులను ఏనుగుపై అంబారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున మన్మథుని కామదహనం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో హోళీ పండగను నిర్వహించారు. పెద్దలు, పిల్లలు తేడా లేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

నేటి నుంచి రామాయణ ప్రవచనాలు

ఆదోనిఅర్బన్: శ్రీ లక్ష్మమ్మవ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో రాయచోటి రామయ్య ఆధ్వర్యంలో పండితులు సుస్వరం నాగరాజుచే రామాయణం ప్రవచనాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయని అవ్వ బ్యాంక్ సీఈఓ గట్టు మురళీకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6:30 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. ఎస్టీయూ భవనంలో ఆర్థిక కార్యదర్శి శేక్షావలి అధ్యక్షతన మండల నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్నూలులో జరిగిన హెల్త్ క్యాంపునకు వెళ్లి స్క్రీనింగ్ చేసుకున్న ఉపాధ్యాయులకు కూడా ఎన్నికల విధులు కేటాయించారన్నారు. అధికారులు స్పందించి గర్భిణులు, చంటి బిడ్డలు కలిగిన వారితో పాటు దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని మానవతా దృక్పథంతో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు సుంకన్న, రామాంజినేయులు, సుధాకర్‌బాబు, మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు.. అభివృద్ధికి చోటు



గుడికంబాలిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ చిహ్నమైన ఫ్యాన్ గుర్తుకు ఓటువేస్తేనే అభివృద్ధి, సంక్షేమ సాధ్యం అవుతుందని గుడికంబాలి సర్పంచ్ సిద్దేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని గుడికంబాలి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఓటర్లను కోరారు. ప్రతి కుటుంబానికి జరిగిన సంక్షేమం, గ్రామంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. బసవరాజ్‌గౌడ్, గుడిసెల బసప్ప, ఈరన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

నివాళి



మేకడోణ సర్పంచ్ ఈ కృష్ణగౌడ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : పెద్దకడబూరు ఉప సర్పంచ్, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి తండ్రి, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి (77) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రవిచంద్రరెడ్డి, మండల నాయకుడు గజేంద్రరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాటే మేకడోణ గ్రామంలోశనివారం సాయంత్రం మృతి చెందిన సర్పంచ్ కృష్ణగౌడ్ మృతదేహానికి నివాళలర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైభవంగా లంకోత్సవం



హనుమంతుడిపై శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం లంకోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి హనుమంతుడిపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా జనవాహిని మధ్య ఊరేగింపు చేశారు. అశేష భక్తజనం మధ్య బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. లంకోత్సవం రోజున హనుమంతుడికి స్వామివారు రాముడి రూపంలో కన్పించారని అందువల్ల బ్రహ్మోత్సవాలలో శ్రీవారిని దర్శించుకుంటే బుద్ధి, బలం, ధైర్యం పొందుతారని ప్రతీతి. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్, పురుషోత్తం చౌదరి, సీతారామిరెడ్డి గ్రామస్తులు రామలింగారెడ్డి, ఎంపీటీసీలు కాశమ్మ, జ్యోతిలత చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎం బస్సు యాత్రను జయప్రదం చేద్దాం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలకు ఆలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం దేవనకొండ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సీఎం సభ విజయవంతం చేయడంపై చర్చించారు. నాయకులు అలారుదిన్నె ప్రభాకర్ రెడ్డి, తువ్వదొడ్డి మోహన్ రెడ్డి, కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు, ప్రేమనాథ్ రెడ్డి, సర్పంచ్‌లు సంఘం మండలాధ్యక్షుడు అరుణకుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి కొత్తకాపుమధుసూదన్‌రెడ్డి తదితరులు విరుపాక్షికి కొన్ని సూచనలు చేశారు.